సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



'తునికాకు' టెండర్లు ఖరారు

తునికాకు సేకరణకు టెండర్ల ప్రక్రియ ఖరారైంది. ఈ నెల 6 నుంచి 14 వరకు మొదటి విడత టెండర్లు స్వీకరించనున్నారు. 8లో



101 శాతం బొగ్గు ఉత్పత్తి

కొత్తగూడెం ఏరియాలో జనవరిలో 13.71 లక్షల టన్నులకు గాను 13.78 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసినట్లు జీఎం తెలిపారు. 10లో

గరిష్టం / కనిష్టం
34° / 17°

వాతావరణం

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. రాత్రి మాత్రం కొంత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

3 నుంచి సహస్ర కలశాభిషేకోత్సవాలు

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఈనెల 3 నుంచి 5 వరకు సహస్ర కలశాభిషేకోత్సవాలు నిర్వహించనున్నారు. 3వ తేదీన పవిత్ర గోదావరి నుంచి గోదావరి జలాలు తీసుకొచ్చి అంకురార్పణ, 4న సహస్ర కలశావాహనం, హవనం, 5వ తేదీన సహస్ర కలశాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అధికారులు వివరించారు. అలాగే రంగనాయకస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ మూడు రోజుల పాటు స్వామివారి నిత్యకల్యాణాలు నిలిపివేస్తున్నామని తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో ఏడీఏ సత్తా



అఫ్జల్ బేగం

అశ్వారావుపేటరూరల్: జాతీయ స్థాయిల్ షటిల్ పోటీల్లో అశ్వారావుపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు అఫ్జల్ బేగం సత్తా చాటుతున్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 6 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఆమె ఎంపికయ్యారు. తొలిరోజు మంగళవారం జరిగిన పోటీలో చండీఘర్ క్రీడాకారిణిపై సింగిల్ విభాగంలో విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్ర జట్టు నుంచి ఆమె జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గురుకుల కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని తెలంగాణ మైనారిటీ ప్రభుత్వ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లిల్లీ సృజన సార మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో ముస్లిం మైనారిటీలకు 26, క్రిస్టియన్లకు 2, జైన్, బుద్ధ, పార్శీ, సిక్కులకు 2, నాన్ మైనారిటీల్లో ఎస్సీ 2, ఎస్టీ 2, బీసీ 5, జనరల్ 1 సీటు చొప్పున ఉన్నాయని వివరించారు. అన్ని పని దినాల్లో కళాశాలలో ఉచితంగా ఆన్‌లైన్ ద్వారా లేదా మీసేవ, ఆన్‌లైన్ సెంటర్లలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. www.tmreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థిని తండ్రి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల లోపు ఉండాలని సూచించారు.

సదరం క్యాంపునకు 61 మంది హాజరు



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

చుంచుపల్లి: జిల్లాలోని దివ్యాంగుల కోసం డీఆర్డీఏ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంప్ నిర్వహించారు. ఇందుకు ముందుగానే స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించడంతో దివ్యాంగులు భారీగానే హాజరయ్యారు. ఈ ఏడాది తొలి సదరం క్యాంపునకు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారు ఏడుగురు, మరో 54 మంది రెన్యువల్ అభ్యర్థులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు, డీఆర్డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగుబడినట్టే..



కార్పొరేట్ పాఠశాలను తలపిస్తున్న ఇల్లెందులోని స్టేషన్ బస్తీ యూపీఎస్

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు

- 'మన ఊరు – మన బడి' తొలివిడతలో 368 స్కూళ్ల ఎంపిక
- 25 పాఠశాలల్లో చివరి దశకు చేరిన పనులు
- నేడు ఇల్లెందులో రెండు స్కూళ్లు ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్/ఇల్లెందు: కార్పొరేట్ విద్యా సంస్థలకు ఏ మాత్రం తీసిపోని విధంగా సర్కారు పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయి. విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పాఠశాలల్లో సకల సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందించేలా చర్యలు చేపడుతోంది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి సర్కారు పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టడంతో అడ్మిషన్ల సంఖ్య భారీగా పెరిగింది. దీంతోపాటు 'మన ఊరు – మన బడి' కార్యక్రమంలో తొలి విడతలో 368 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి నిధులు సమకూర్చింది. ఆయా పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో సకల సౌకర్యాలు కల్పించేలా పనులు జరుగుతున్నాయి. టాయిలెట్లు, తాగునీటి పంపులు, అదనపు తరగతి గదులు, రూఫ్ నిర్మాణం, ప్రహరీలు, గ్రీనరీ, వంటషెడ్ల నిర్మాణం, ఫర్నిచర్ వంటివి సమకూరుస్తున్నారు. ఇలా ఎంపిక చేసిన వాటిలో ఆళ్లపల్లి, అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, చంద్రుగొండ, చర్ల, దమ్మపేట, దుమ్ముగూడెం, కరకగూడెం, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, మణుగూరు, ములకలపల్లి, పాల్వంచ, పినపాక, సుజాతనగర్, ఇల్లెందు మండలాల్లోని 25 పాఠశాలల్లో నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా పనులు పూర్తయిన పాఠశాలలను బుధవారం సీఎం కేసీఆర్ వర్చువల్ పద్ధతిలో ఓపెనింగ్ చేయనుండగా.. ఇందులో పనులు మొత్తం పూర్తయిన ఇల్లెందులోని స్టేషన్ బస్తీ ఉర్దూ, యూపీఎస్ పాఠశాలలు ఉన్నాయి. ఉర్దూ పాఠశాలలో రూ. 31.66 లక్షలు, యూపీఎస్‌లో రూ. 32.93 లక్షలతో పనులు చేపట్టారు. వర్చువల్ కార్యక్రమం పూర్తయిన తర్వాత కలెక్టర్ అనుదీప్, స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ ఈ పాఠశాలలను ప్రారంభించనున్నారు. మిగిలిన 23 పాఠశాలలు కూడా త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు, విద్యా బోధన అందితే ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతుందని విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అంటున్నారు.



బుధవారం ప్రారంభం కానున్న స్టేషన్ బస్తీ ప్రాథమికోన్నత పాఠశాల



యూపీఎస్‌లో చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

మా బడి బాగుంది

పాత బడి కనిపించకుండా మారిపోయింది. మేమంతా కొత్తబడికి వచ్చినట్టుంది. కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేశారు. మంచినీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, బ్లాక్‌బోర్డు ఏదీ చూసినా కొత్తగా ఉన్నాయి.

– హర్షవర్ధన్, విద్యార్థి, యూపీఎస్ స్టేషన్ బస్తీ

రూపురేఖలు మారాయి

ప్రభుత్వం మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలను బాగు చేస్తోంది. తొలి విడతలో మా పాఠశాలకు చాన్స్ లభించింది. దీంతో మా బడి రూపు రేఖలే మారిపోయాయి. మునుపెన్నడూ లేనంతగా పాఠశాల సుందరంగా మారింది.

– బుచ్చయ్య, హెచ్‌ఎం, యూపీఎస్ స్టేషన్ బస్తీ

పాఠశాలల్లో సకల సౌకర్యాలు

జిల్లాలోని వివిధ మండలాల్లో 25 పాఠశాలలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. మిగిలిన పాఠశాలల్లో కూడా పనులు వేగవంతం చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలతో పాటు నాణ్యమైన బోధన అందించేలా చర్యలు చేపడుతున్నాం.

– ఎస్.ఎస్.ఎస్. ప్రసాద్, డీఈఓ

కార్పొరేట్‌కు దీటుగా..

20 ఏళ్ల క్రితం నిర్మించిన పాత భవనాల్లో తాగునీరు లేక, మరుగుదొడ్లు, మూత్రశాలలు తరగతి గదులు ఉన్నా అధ్వానంగా మారిన క్రమంలో ఆయా పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. సకల సదుపాయాలు కల్పించారు. పాత గదులను మరమ్మతులు చేసి టైల్స్, రంగులతో అలంకరించి పార్కును తలపించేలా సుందరంగా తయారు చేశారు. నీటి సదుపాయం కోసం బోరు, మోటారు, సంప్ వంటి సౌకర్యాలు కల్పించారు. గదుల్లో లైట్లు, ఫ్యాన్లు, గేట్లు, బోర్డు, భోజనం చేశాక చేతులు శుభ్రం చేసుకునేందుకు ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. ఇక తరగతి గదుల్లో బల్లలు కుర్చీలు, బ్లాక్ బోర్డులు కూడా అధునాతనంగా ఏర్పాటు చేశారు. దీంతో చిన్నారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



వివరాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది

చుంచుపల్లి: కొత్తగూడెంలోని పద్మావతి, మెడికేర్, రాజశేఖర్, భవిత, బాలాజీ డయాగ్నస్టిక్ సెంటర్లలో వైద్యశాఖ సిబ్బంది, అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలకు డిప్యూటీ డెమో ఫైజ్ మొహియుద్దీన్, హెల్త్ ఎడ్యూకేటర్ విజయ్‌కుమార్ తగు సూచనలు చేశారు. గర్భ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా నిర్వహించినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కంటిచూపును కాపాడుకోండి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్



కంటివెలుగు శిబిరంలో పరీక్ష చేయించుకుంటున్న జడ్జి చంద్రశేఖర ప్రసాద్

కొత్తగూడెంటౌన్: దృష్టి సమస్యలు ఉన్నవారు కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్ష చేయించుకోవాలని, కంటిచూపును కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖర ప్రసాద్ అన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో మంగళవారం న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులకు కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో పరీక్ష చేయించుకున్న అనంతరం జిల్లా జడ్జి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. భవిష్యత్‌లో దృష్టి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దృష్టి సమస్యలు ఉన్నవారు వైద్యుల సహకారంతో పరిష్కరించుకోవాలని చెప్పారు. డీఎంహెచ్ఓ శిరీష మాట్లాడుతూ.. దృష్టి లోపం ఉన్నవారికి వైద్యులు పరీక్ష చేసి కళ్లజోళ్లు ఇస్తారని, దూరం చూపు ఉన్నవారి ఇళ్లకు ఏఎన్ఎంలు వచ్చి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లను అందజేస్తారని తెలిపారు. కాగా, ఈ శిబిరంలో సుమారు 200 మంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు జి.భానుమతి, ఎ.నీరజ, వి.రామారావు, పీపీ పోసాని రాధాకృష్ణమూర్తి, పి.వి.డి లక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాదరావు, మునిగడప వెంకటేశ్వర్లు, మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.6 కోట్లు ఇవ్వండి..

- నీతిఆయోగ్ మిషన్ డైరెక్టర్‌కు కలెక్టర్ వినతి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదించిన రూ.6 కోట్లు మంజూరు చేయాలని నీతిఆయోగ్ మిషన్ డైరెక్టర్ రాకేష్ రంజన్ ఆకాంక్షితను కలెక్టర్ అనుదీప్ కోరారు. మంగళవారం ఢిల్లీ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. తన క్యాంప్ కార్యాలయం నుంచి అనుదీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ఎంపిక చేసిన 1000 అంగన్‌వాడీ కేంద్రాలకు చిరుధాన్యాలు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రతిపాదనల సిద్ధం చేసినట్లు చెప్పారు. అనంతరం జిల్లా ప్రణాళికాధికారి, మిల్లెట్స్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్, యాస్పిరేషన్ ప్రోగ్రాం లీడర్‌తో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మిల్లెట్ ఫుడ్ ఇంపాక్ట్ స్టడీ ఏర్పాటు చేయాలని చిరుధాన్యాల ప్రాజెక్టు కో ఆర్డినేటర్ మోహన్‌ను ఆదేశించారు. నీతి ఆయోగ్ మంజూరు చేసిన నిధులు నేరుగా ఏజెన్సీలకు చెల్లించేందుకు సంబంధిత ఏజెన్సీలను మ్యాపింగ్ చేయాలని యాస్పిరేషన్ జిల్లా ప్రోగ్రాం లీడర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళికాధికారి శ్రీనివాసరావు, యాస్పిరేషన్ జిల్లా ప్రోగ్రాం లీడర్ పియూష్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌పై అవగాహన పెంచాలి

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. తన చాంబర్‌లో మంగళవారం ఉద్యాన, వ్యవసాయ, ఆయిల్‌పామ్, బిందు సేద్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఈ ఏడాది 16,860 ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని, ఇప్పటివరకు 12 వేల ఎకరాల్లో మొక్కలు నాటారని, మిగిలిన 4,860 ఎకరాల్లో మొక్కలు నాటే ప్రక్రియను మార్చి 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయిల్ దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి చేరాలన్నారు. ఆయిల్‌పామ్ పంటకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రైతుల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. మండలాల వారీగా లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పామాయిల్ సాగులో బిందు సేద్యం చేయాలని, తద్వారా నీటి వినియోగం తగ్గుతుందని తెలిపారు. బిందు సేద్యానికి ఎస్సీ, ఎస్టీలకు నూరుశాతం, బీసీలకు 90 శాతం, ఓసీలకు 80 శాతం రాయితీలు ఇస్తున్నట్లు వివరించారు. బిందుసేద్యం లక్ష్యసాధనలో వెనుకబడిన జిల్లా కోఆర్డినేటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉద్యాన అధికారిని ఆదేశించారు. ప్రభుత్వం గుర్తించిన ఆయిల్‌పామ్ కంపెనీల నుంచే రైతులు మొక్కలు తీసుకునేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న, వ్యవసాయ అధికారి కొర్స అభిమన్యుడు, ఆయిల్ ఫెడ్ డివిజనల్ అధికారి బాలకృష్ణ, గోద్రేజ్ మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు నేడు తుది గడువు



వెరిఫికేషన్ ప్రక్రియపై సూచనలు చేస్తున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కోసం బుధవారం సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ఎస్.ఎస్. ప్రసాద్ తెలిపారు. ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలతో మంగళవారం ఏర్పాటుచేసిన జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీచర్ల బదిలీలు, ప్రమోషన్లకు వచ్చిన ఎస్జీటీల దరఖాస్తులను కాంప్లెక్స్ స్థాయిలో ప్రధానోపాధ్యాయులు పరిశీలించి మండల విద్యాధికారికి అందజేయాలన్నారు. అలాగే ఉన్నత పాఠశాలల లోని దరఖాస్తులను పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా మండల విద్యాధికారికి సబ్మిట్ చేయాలని, వచ్చిన దరఖాస్తులన్నింటిని ఎంఈఓలు మూడో తేది ఉదయం నాటికి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు ఎవరైనా అప్పీళ్లు ఇవ్వాలనుకుంటే సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు నేరుగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల విషయంలో సరైన ఆధారాలతో గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మరోసారి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. పాఠశాలల పనివేళల్లో డీఈఓ కార్యాలయానికి ఎవరూ రావద్దని స్పష్టం చేశారు. జూమ్ సమావేశంలో సెక్టోరియల్ అధికారులు ఎ.నాగరాజశేఖర్, ఎస్‌కే.సైదులు, ఎస్.సతీష్‌కుమార్, ఏపీఓ.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెరిఫికేషన్ల కౌంటర్ల పరిశీలన..

కొత్తగూడెంలోని సింగరేణి పాఠశాలలో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన వెరిఫికేషన్ ప్రక్రియను, కౌంటర్లను డీఈఓ ఎస్.ఎస్.ఎస్. ప్రసాద్ పరిశీలించారు. వెరిఫికేషన్ చేసే విధానంపై ఆరా తీసి, సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు.

సౌత్ ఇండియా సైన్స్ ఇన్‌స్పైర్‌లో ప్రతిభ



కేరళలో బహుమతి అందుకుంటున్న అశ్విని

ఇల్లెందురూరల్: అద్భుత ఆలోచన, ఆకట్టుకునే నమూనాలతో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సైన్స్ ఇన్‌స్పైర్‌లలో చక్కటి ప్రదర్శనలు ఇచ్చి.. చివరకు దక్షిణ భారత స్థాయి సైన్స్ ఇన్‌స్పైర్‌లో ప్రత్యేక బహుమతిని సొంతం చేసుకుంది రొంపేడు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థిని బాదావత్ అశ్విని. నిర్మల్ జిల్లాలో జనవరి 9న జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌లో అద్భుత ప్రదర్శన ఇచ్చిన అశ్వినితో పాటు ఇల్లెందు ఆశ్రమ పాఠశాల విద్యార్థిని కొర్స కార్తీక దక్షిణ భారత స్థాయి సైన్స్ ఇన్‌స్పైర్‌కు ఎంపికయ్యారు. జనవరి 27 నుంచి కేరళ రాష్ట్రంలో జరిగిన సైన్స్ ఇన్‌స్పైర్‌లో బాదావత్ అశ్విని 'సహజ వనరుల పొదుపు' అనే అంశంపై, కొర్స కార్తీక 'కాలుష్య నివారణకు సీసీఎస్ మార్గం' అనే అంశాలపై ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. వీరిలో అశ్విని అద్భుత ప్రదర్శన చేసి ప్రత్యేక బహుమతి గెలుచుకుంది. కాగా, ఇద్దరు విద్యార్థులను, వారికి మార్గదర్శకులుగా వ్యవహరించిన ఉపాధ్యాయులను ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ రూపాదేవి అభినందించారు.

అంబులెన్స్‌లకు అస్వస్థత!

- తరచూ మొరాయిస్తున్న 108 వాహనాలు
- ఏజెన్సీ వాసులకు సకాలంలో అందని వైద్యం
- కాలం చెల్లిన వాహనాలతో తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని వైద్యారోగ్య శాఖ అధికారులు



ఇటీవల గుండాలలో నిలిచిపోయిన అంబులెన్స్‌ను ట్రాక్టర్ సాయంతో తీసుకెళ్తున్న సిబ్బంది

చుంచుపల్లి: రోడ్డు ప్రమాదం జరిగినా.. అస్వస్థతకు గురైనా.. పురిటి నొప్పులైనా.. మరే ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడినా వెంటనే గుర్తొచ్చేది 108 అంబులెన్స్. ఫోన్ చేసిన 10 – 15 నిమిషాల్లో వచ్చి.. తాత్కాలిక చికిత్స అందించడంతో పాటు ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రాణదాత ఈ వాహనం. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 108 వాహనాలను ప్రవేశ పెట్టారు. అయితే ప్రస్తుతం ఈ అంబులెన్స్‌లే అస్వస్థతకు గురవుతున్నాయి. దీంతో జిల్లాలోని మారుమూల ప్రాంతాల ఏజెన్సీ వాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. పలు వాహనాలు తరచూ మొరాయిస్తుండడంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఇంత జరుగుతున్నా 108 వాహనాల పనితీరును పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొరాయిస్తున్న వాహనాలు..

జిల్లా వ్యాప్తంగా 108 వాహనాలు 21 ఉన్నాయి. కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, చంద్రుగొండ, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, దమ్మపేట, టేకులపల్లి, ఇల్లెందు, ఆళ్లపల్లి, గుండాల, భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం, సుజాతనగర్, జూలూరుపాడు మండలాల పరిధిలోని ప్రజలకు ఇవి సేవలందిస్తున్నాయి. జిల్లాలోని 108 వాహనాల్లో బీఎస్ – 3, బీఎస్ – 4, బీఎస్ – 6 అని మూడు రకాలు ఉన్నాయి. ఇందులో తొలిదశలో వచ్చిన వాహనాలు బీఎస్ – 3, బీఎస్ – 4 మోడల్‌కు చెందినవి. ఒక్కో వాహనం సుమారు 4 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణించడంతో కాలం చెల్లిపోయి తరచూ మొరాయిస్తున్నాయి. అత్యవసర సమయాల్లో ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట కదల్లేక నిలిచిపోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వీటి మరమ్మతులకు భారీగా నిధులు వెచ్చిస్తున్నారే తప్ప కొత్త వాహనాలు కొనుగోలు చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం తమ ప్రాణాల మీదకు తెస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం దృష్టి సారించకపోవడంతో కొత్త వాహనాలకు మోక్షం కలగడం లేదని వాపోతున్నారు. గతేడాది జూలైలో చర్ల మండలం రాళ్లపురం గ్రామానికి చెందిన మడవి చుడికీ అనే మహిళ ఎలుకల మందు తాగింది. వెంటనే 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా వాహనం మధ్యలోనే మొరాయించింది. దీంతో సకాలంలో చికిత్స అందక ఆమె ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. జిల్లాలో ప్రధానంగా పినపాక, దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం, పినపాక, ఆళ్లపల్లి, గుండాల, ఇల్లెందు వంటి ఏజెన్సీ మండలాల ప్రజలకు సేవలందించే 108 అంబులెన్స్‌లు అత్యవసర సమయాల్లో తరచూ మొరాయిస్తుండటంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

- గుండాల మండలం చీమలగూడేనికి చెందిన ఓ మహిళ గత శుక్రవారం రాత్రి పురిటి నొప్పులతో బాధపడుతుంటే కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేశారు. గుండాల పంచాయతీ కార్యాలయంలో ఉంచిన ఈ వాహనం ఎంతకూ స్టార్ట్ కాలేదు. అక్కడు న్న వారు కొంత దూరం నెట్టినా ఫలితం శూన్యం. దీంతో మధ్యలోనే నిలిచిపోయిన వాహనాన్ని శనివారం ట్రాక్టర్ సహాయంతో తిరిగి యథాస్థానంలో పెట్టారు. సకాలంలో 108 వాహనం రాకపోవడంతో గర్భిణిని ఆళ్లపల్లి మండలానికి చెందిన వాహనంలో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.
- గుండాల మండలం ఘనాపురం గ్రామానికి చెందిన ఊకె బుచ్చయ్య ఆదివారం పాము కాటుకు గురయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేస్తే వాహనం మరమ్మతుకు గురైందని సిబ్బంది తెలిపారు. దీంతో బుచ్చయ్యను ట్రాక్టర్ ఎక్కించి గుండాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆళ్లపల్లి మండలానికి చెందిన 108 వాహనంలో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

శీతాకాలంలోనే సమస్య

జిల్లాలో 21 108 అబులెన్స్‌లు సేవలందిస్తున్నాయి. ఇందులో కొన్ని పాత (బీఎస్ – 3 మోడల్) వాహనాలు ఉన్నాయి. వీటికి చిన్నచిన్న సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా శీతాకాలంలోనే 108 వాహనాలు తరచూ మొరాయిస్తుంటాయి. ప్రతి రోజూ ఉదయమే 108 వాహనాలను కొద్దిసేపు నడిపి వాటి పనితీరును గమనించాలని డ్రైవర్లకు ఆదేశాలిస్తాం.

– భూమా నాగేందర్, ఉమ్మడి జిల్లా 108 మేనేజర్

క్లుప్తంగా

శ్రీ సమ్మక్క - సారలమ్మ జాతర ప్రారంభం



పుట్టమట్టి సేకరిస్తున్న దేవర బాలలు

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెంలో కొలువై ఉన్న శ్రీసమ్మక్క - సారలమ్మ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. గ్రామంలోని చెరువు దగ్గరకు కోయ సంప్రదాయ నృత్యాలు, మేళతాళాలతో వెళ్లి పుట్టమట్టి తీసుకొచ్చి గద్దెల ప్రాంగణంలో మండమెలుగు వేడుక నిర్వహించారు. నాలుగు రోజుల పాటు ఈ జాతర కొనసాగనుంది. దేవర బాలలుగా సోడి శాంతమ్మ, అచ్చమ్మ వ్యవహరించారు.

కల్వర్టు పైనుంచి రాకపోకలు షురూ..



కడియాలబుడ్డి వాగుపై నిర్మించిన కల్వర్టు ఇదే..

అశ్వాపురం: మండలంలోని మొండికుంట–సారపాక రహదారిపై మంగళవారం నుంచి రాకపోకలు పునరుద్ధరించారు. గరిబడ్డు గ్రామం వద్ద రామచంద్రాపురం స్టేజీ సమీపంలో కడియాలబుడ్డి వాగుపై రహదారి కోతకు గురై కల్వర్టు ప్రమాదకరంగా ఉండటంతో ఆర్అండ్బీ శాఖ ఆధ్వర్యంలో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. కాగా, వారం రోజులుగా ఆర్అండ్బీ అధికారులు మొండికుంట–సారపాక రహదారిపై ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలకు అనుమతి నిరాకరించగా.. కల్వర్టు నిర్మాణం పూర్తవడంతో పునరుద్ధరించారు.

ఇద్దరు లారీడ్రైవర్ల నిర్లక్ష్యం

భద్రాచలం వంతెనపై గంటపాటు నిలిచిన రాకపోకలు



ట్రాఫిక్ జామ్‌కు కారణమైన లారీలు

భద్రాచలంటౌన్: భద్రాచలం గోదావరి వంతెనపై ఇద్దరు లారీ డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సుమారు గంటపాటు రాకపోకలు స్తంభించాయి. మంగళవారం ఉదయం గోదావరి వంతెనపైకి వచ్చిన రెండు లారీలను ఎదురెదురుగా నిలపడంతో లారీలకు ఇరువైపుల వంతెనపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సుమారు గంటపాటు ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గంటపాటు ట్రాఫిక్ అంతరాయానికి కారణమైన లారీ డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేశారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,881

‘తునికాకు’ టెండర్లు ఖరారు

- జిల్లాలోని ఆరు డివిజన్లలో సేకరణ
- లక్ష్యం 58,500 స్టాండర్డ్ బ్యాగులు
- ఈనెల 6 నుంచి టెండర్లు షురూ..



కిన్నెరసాని అభయారణ్యంలో తునికాకు సేకరిస్తున్న కూలీలు (ఫైల్)

పాల్వంచరూరల్: తునికాకు సేకరణ కోసం టెండర్ల ప్రక్రియ ఖరారైంది. బీడీ ఆకుల విక్రయం కోసం 2023–2024 సంవత్సరం ఆన్‌లైన్ ద్వారా ఈ టెండర్లను ఈనెల 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మొదటి విడత టెండర్, 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రెండో విడత, మార్చి 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మూడో విడత టెండర్లను తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ టెండర్ నోటీసు జారీ చేసినట్లు డీఎం పృథ్వీరాజ్ తెలిపారు. గతేడాది నిర్దేశించిన తునికాకు లక్ష్యాన్ని ఈ సంవత్సరం కూడా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. మొదటి విడత ప్రక్రియలో భాగంగా 6వ తేదీన టెండర్ డౌన్‌లోడ్ చేసుకుని 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దాఖలు చేయాల్సి ఉంటుంది. రెండో విడతలో 21న ఆన్‌లైన్ టెండర్ నోటీసును డౌన్‌లోడ్ చేసుకుని 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దాఖలు చేయాల్సి ఉంటుంది. మూడో విడతలో మార్చి 10వ తేదీన ఆన్‌లైన్‌లో టెండర్ నోటీసును డౌన్‌లోడ్ చేసుకుని 15 నుంచి 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దాఖలు చేయాలని డీఎం పేర్కొన్నారు.

జిల్లాలో తునికాకు టార్గెట్

జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో తునికాకు సేకరణ లక్ష్యం 58,500 స్టాండర్డ్ బ్యాగులుగా నిర్దేశించారు. పాల్వంచ డివిజన్ పరిధిలో 2,300, కిన్నెరసాని అభయారణ్యం డివిజన్‌లో 3,200, కొత్తగూడెం డివిజన్ పరిధిలో 3,900, ఇల్లెందు డివిజన్ పరిధిలో 10,600, భద్రాచలం డివిజన్‌లో 9,700, మణుగూరు డివిజన్‌లో 5,400, కొత్తగూడెం సర్కిల్ పరిధిలో ఉన్న మహబూబాబాద్ డివిజన్‌లో 6,300, గూడూరు డివిజన్‌లో 17,100 స్టాండర్డ్ బ్యాగులు లక్ష్యంగా పేర్కొన్నారు. కిన్నెరసాని అభయారణ్యం పరిధిలోని ఐదు యూనిట్లలో 3,200 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరణ లక్ష్యం కాగా, పాల్వంచ డివిజన్‌లోని నాలుగు యూనిట్ల పరిధిలో 2,500 స్టాండర్డ్ బ్యాగులు లక్ష్యంగా నిర్దేశించారు. పాల్వంచ డివిజన్ పరిధిలోని అశ్వారావుపేట యూనిట్ పరిధిలో 2,300 స్టాండర్డ్ బ్యాగులు, దమ్మపేట యూనిట్‌లో 600, ములకలపల్లి యూనిట్‌లో 1,300, పాల్వంచ యూనిట్‌లో 400 లక్ష్యంగా నిర్దేశించారు. వైల్డ్‌లైఫ్ పరిధిలోని యానంబైల్ యూనిట్‌లో 1,400, ఆళ్లపల్లి యూనిట్ పరిధిలో 1,600, చాతకొండ యూనిట్‌లో 1,500, రేగళ్ల యూనిట్‌లో 100 స్టాండర్డ్ బ్యాగులు లక్ష్యంగా నిర్దేశించారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ చివరి వారం నుంచే తునికాకు సేకరణ జరుగుతుంది. వేసవి సీజన్‌లో నెలరోజుల పాటు గిరిజన కూలీలు తునికాకును సేకరిస్తారు. సేకరించిన ఆకును ఇళ్లకు చేర్చి.. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు 50 ఆకుల చొప్పున కట్టలు కట్టి వాటిని తీసుకవెళ్లి కల్లాల్లో అప్పగిస్తారు. ఇలా వారానికి ఒకసారి ఎన్ని ఆకుల కట్టలు సేకరించారో లెక్కలు వేసుకుని కాంట్రాక్టర్ ద్వారా డబ్బులు తీసుకుంటారు.

నవోదయ నిర్మిస్తారా.. లేదా?

- తొమ్మిది నెలల కిందట 30 ఎకరాల స్థలం గుర్తింపు..
- ఇప్పటికీ మొదలు కాని పనులు



భూమిని పరిశీలిస్తున్న విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు, తహసీల్దార్ (ఫైల్)

అశ్వాపురం: జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం భవన నిర్మాణానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత ఏప్రిల్ 30వ తేదీన అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు గ్రామంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని 30 ఎకరాలు గుర్తించారు. నవోదయ విద్యాలయం నిర్మాణానికి సుమారు రూ.50 కోట్లు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు భవన నిర్మాణం చేపట్టేందుకు 30 ఎకరాల స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ అధికారులు భవన నిర్మాణానికి భూమి అనువుగా ఉందని జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రక్రియ అంతా తొమ్మిది నెలల కిందట జరిగింది. అయినప్పటికీ విద్యాలయ భవన నిర్మాణ పనులు మాత్రం ఇంతవరకు మొదలు కాలేదు. దీంతో బీజీ కొత్తూరు గ్రామంలో విద్యాలయం ఏర్పాటవుతుందా? లేదా? అని స్థానికులు, మండల ప్రజలు సందిగ్ధంలో పడ్డారు. రెవెన్యూ అధికారులు గుర్తించిన 30 ఎకరాల భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకున్నారు. ఈ విద్యాలయం ఏర్పాటుతో ఏజెన్సీ ప్రాంతంలోని విద్యార్థులకు సైతం బాగా చదవాలనే కాంక్ష పెరుగుతుందని, వారికి కూడా ఇలాంటి విద్యాలయాల్లో చదవాలనే భావన పెరుగుతుందని ప్రజలు చెబుతున్నారు. అభివృద్ధిలో, పారిశ్రామికంగా పినపాక నియోజకవర్గం అభివృద్ధి చెందుతుండటంతో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుతో విద్యాపరంగా కూడా ముందంజలో ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి అశ్వాపురం మండలం బీజీకొత్తూరు గ్రామంలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. కాగా, భవన నిర్మాణం అంశంపై తహసీల్దార్ సురేశ్ కుమార్‌ను వివరణ కోరగా అధికారుల ఆదేశాల మేరకు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి కలెక్టర్‌కు నివేదించాం. వారి నుంచి వచ్చే ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

చేపల పెంపకంతో జీవనోపాధి

జిల్లా మత్స్యశాఖ అధికారి వీరన్న



సామగ్రి పంపిణీ చేస్తున్న మత్స్యశాఖాధికారి వీరన్న

భద్రాచలం: ప్రభుత్వం చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను పోస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు జీవనోపాధి పొందాలని జిల్లా మత్స్యశాఖ అధికారి వీరన్న అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం గిరిజన సొసైటీలకు రూ.1.62 లక్షల విలువైన సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టేకులపల్లి, ఇల్లెందు, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, మణుగూరు, బూర్గంపాడు, పినపాక మండలాల్లోని 250 మంది గ్రూపు సభ్యులకు కిట్లు అందజేసినట్లు వివరించారు. ఇందులో రూ.13 వేల విలువైన ఇసురు వల, గ్రేట్ వల, తెప్పలు, గ్రూపునకు రెండు సెట్ల చొప్పున సామగ్రి అందజేశామని వెల్లడించారు. సొసైటీల పనితీరును బట్టి త్వరలో మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని చెప్పారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్



గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మణుగూరుటౌన్: మండలంలోని ఇష్టా కార్యాలయం సమీపంలో మంగళవారం రాత్రి ఆగి ఉన్న లారీని ఓ ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే మణుగూరు ఎస్ఐ రాజ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగ్రాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. అతడి వద్ద ఉన్న వాహన పత్రాల ఆధారంగా అతడు బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సీహెచ్ పెదబాబుగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గంజాయి రవాణా కేసులో 12ఏళ్ల జైలు

కొత్తగూడెంటౌన్: అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరికి చెందిన పలసా లక్ష్మణ్‌రావుకు 12 ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (స్పెషల్ జడ్జి ఫర్ ఎన్‌డీపీఎస్ యాక్ట్) ఎం.శ్యాంశ్రీ మంగళవారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. 25-06-2018న భద్రాచలంటౌన్ ఎస్ఐ మహేశ్ బృందం కూనవరంరోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అటుగా వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా 221.620 కేజీల గంజాయి (విలువ రూ.6,64,860) దొరికింది. ఎస్ఐ మహేశ్ ఫిర్యాదు మేరకు అప్పటి హెచ్‌సీ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ పంచనామా చేసి, సీజ్ చేశారు. ఒడిశా మల్కన్‌గిరి జిల్లా నిమ్మలపాలెం గ్రామానికి చెందిన పలసా లక్ష్మణ్‌రావు, బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన చింత పృథ్వీలను కోర్టులో హాజరుపరిచారు. అనంతరం భద్రాచలంటౌన్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఐదుగురు సాక్షులను విచారించిన అనంతరం పలసా లక్ష్మణ్‌రావు పై నేరం రుజువు కావడంతో 12 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. చింతా పృథ్వీపై నేరం రుజువు కాకపోవడంతో నిర్దోషిగా విడుదల చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పీవీడీ లక్ష్మీకుమారి, కె.రామారావు వాదించారు. లైజన్ ఆఫీసర్ హరిగోపాల్, భద్రాచలంటౌన్ కోర్టు ఏఎస్ఐ గంజి శశిధర్ సహకరించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య..

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని కూనవరం గ్రామానికి చెందిన మడకం రాంబాబు (40) మంగళవారం పురుగులమందు తాగి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నిత్యం మద్యం తాగుతూ ఉండే రాంబాబు.. తాగిన మైకంలో పురుగులమందు సేవించాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించేలోగానే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మణుగూరు సీఐ ముత్యం రమేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యానికి బానిసై..

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు సేవించి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని కొత్త నారంవారిగూడెం గ్రామానికి చెందిన నారం వెంకటయ్య (49) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే మద్యం అధికంగా సేవించి ఆ మత్తులోనే పురుగులమందు సేవించాడు. కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీఏపై ఆగ్రహం ?

పాల్వంచ: వ్యక్తిగత సహాయకుడిపై ఓ ప్రజాప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం మంగళవారం వైరల్‌గా మారింది. ప్రజాప్రతినిధి తనయుడికి, వ్యక్తిగత సహాయకుడికి మధ్య మాటా మాటా పెరగడంతో ప్రజాప్రతినిధి కలుగజేసుకుని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసే లోపే వ్యక్తిగత సహాయకుడు అక్కడి నుంచి వెళ్లిపోయి ఫోన్ స్విచాఫ్ చేసుకున్నాడని, తిరిగి గంటల వ్యవధిలోనే విధుల్లో చేరడంతో వివాదం సద్దుమణిగిందని సమాచారం.

పెట్టుబడులతో రండి

పెట్టుబడులకు ఏపీ అత్యంత అనువైన రాష్ట్రం: సీఎం వైఎస్ జగన్ ● సులభతర వాణిజ్యంలో గత మూడేళ్లుగా నంబర్ వన్

- ఎలాంటి అసౌకర్యం కలిగినా ఒక్క ఫోన్‌కాల్ దూరంలో ఉంటాం
- ఢిల్లీలో పారిశ్రామికవేత్తలతో సన్నాహక సదస్సులో సీఎం భరోసా
- మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్


గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, నాస్కామ్ అధ్యక్షురాలు దేబ్జానీ ఘోష్, అసోచామ్ అధ్యక్షుడు సుమంత్ సిన్హా, భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలు సుచిత్ర ఎల్లా, మంత్రి అమర్‌నాథ్

సాక్షి, న్యూఢిల్లీ: పరిశ్రమల స్థాపనకు అత్యంత అనువైన వాతావరణం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆహ్వానించారు. పరిశ్రమల ఏర్పాటులో అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. మంగళవారం ఢిల్లీలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సులో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. వివిధ దేశాల దౌత్యాధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులతోపాటు మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్ సన్నాహక సదస్సుకు హాజరయ్యారు.

అత్యుత్తమ సౌకర్యాలు

'విశాఖపట్నంలో మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం. దీనికి అందరినీ ఆహ్వానిస్తున్నాం. పరిశ్రమల ఏర్పాటులో మీకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇస్తున్నాం. ఏ పారిశ్రామికవేత్తకైనా ఎలాంటి అసౌకర్యం కలిగినా కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉంటామని కూడా హామీ ఇస్తున్నాం' అని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రారంభోపన్యాసంతో పాటు సదస్సు చివరలో ఏపీలో పెట్టుబడులకు గల సానుకూలతలను సీఎం వివరించారు.

శరవేగంగా అనుమతులు..

☛ పరిశ్రమలకు అనుమతుల విషయంలో రాష్ట్రంలో సింగిల్ డెస్క్ పోర్టల్ విధానం అమలులో ఉందని సీఎం జగన్ తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు 21 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తున్నామని, శరవేగంగా అనుమతులివ్వడం ద్వారా పారిశ్రామికవేత్తల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత అనుకూలంగా ఉందన్నారు.

☛ 11.43 శాతం జీఎస్‌డీపీతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా, అగ్రగామిగా నిలిచింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో గత మూడేళ్లుగా ఏపీ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉంది. పరిశ్రమల స్థాపనకు మేం చేస్తున్న కృషితో పాటు పారిశ్రామికవేత్తలు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌తోనే నంబర్‌వన్ స్థానంలో స్థిరంగా కొనసాగుతున్నాం. తద్వారా పరిశ్రమల స్థాపనకు, పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంత అనుకూలంగా ఉందో స్పష్టమవుతోంది.

> విశాఖపట్నం త్వరలో కార్యనిర్వాహక రాజధాని కాబోతుంది. రానున్న కొద్ది నెలల్లో నేను కూడా విశాఖకు షిఫ్ట్ అవుతున్నా. విశాఖలో నిర్వహించే సదస్సుకు హాజరు కావాలని మీ అందరినీ కోరుతున్నా. మీతో పాటు మీ సహచరులు, ఇతర కంపెనీల ప్రతినిధులను కూడా సదస్సుకు తోడ్కొని వచ్చి ఏపీలో పరిశ్రమల స్థాపన, వ్యాపారం ఎంత సులభతరమో తెలియచేయాలి.
>
> \- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఏప్రిల్ లోపే విశాఖ నుంచి పాలన

- అనేక ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్నాయి
- అవసరమనుకుంటే ప్రైవేట్ భవనాలు లీజ్‌కు తీసుకుంటాం
- న్యాయపరమైన చిక్కులు తొలగిన మరుక్షణమే విశాఖ నుంచి పరిపాలన
- నవీన్‌కు సీబీఐ నోటీసులు అవాస్తవం
- మీడియాతో టీటీడీ చైర్మన్, రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం: ఏప్రిల్ లోపే విశాఖ నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించనున్నారని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. మూడు రాజధానులను అడ్డుకునేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయని, న్యాయపరమైన చిక్కులు తొలగిన మరుక్షణమే విశాఖ నుంచి పరిపాలన కొనసాగుతుందని చెప్పారు. మంగళవారం సింహాచలంలోని గోశాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖను పరిపాలన రాజధాని చేయడం ద్వారా దశాబ్దాలుగా వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి చెందుతుందన్నారు. రాజధాని ఏర్పాటుకు భవనాల సమస్య రాదన్నారు. విశాఖలో ఎక్కువగా ప్రభుత్వ కార్యాలయాలున్నాయని, అదేవిధంగా వీఎంఆర్‌డీఏ భవనాలు కూడా చాలా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అవసరమైతే ప్రైవేట్ భవనాలను కూడా లీజ్‌కి తీసుకుంటామన్నారు. ఐటీ కంపెనీలు లిమిటెడ్‌గానే ఉన్నాయి కాబట్టి ఆ బిల్డింగ్స్‌ను కూడా అవసరమైతే రాజధానికి ఉపయోగించుకుంటామన్నారు. ఎన్నికలకు వెళ్లేలోపు పరిపాలనా వికేంద్రీకరణ అనేది జరిగి తీరుతుందన్నారు. కాగా, ముఖ్యమంత్రి నివాసంలో కీలకంగా ఉండే నవీన్ అనే వ్యక్తితో పాటు పలువురికి సీబీఐ నోటీసులు ఇచ్చిందనేది పూర్తిగా అవాస్తవమని వైవీ సుబ్బారెడ్డి తేల్చి చెప్పారు. సీఎం జగన్ ఇంట్లో గత 12 ఏళ్లుగా నవీన్ అనే వ్యక్తి పనిచేస్తున్నారని తెలిపారు. సీఎం సతీమణి భారతమ్మతో మాట్లాడాలన్నా.. లేదా ఆమె ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవాలన్నా.. తానే కాకుండా తమ కుటుంబ సభ్యులందరూ నవీన్‌కే ఫోన్ చేస్తుంటామని వెల్లడించారు. దాన్ని ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ ఎందుకు భూతద్దంలో పెట్టి చూపిస్తున్నారో అర్థం కాలేదని మండిపడ్డారు.

సీబీఐ విచారణ చేయాలి..

అవినాశ్‌రెడ్డిని సీబీఐ విచారణ చేస్తున్న సమయంలో గదిలో అధికారులు మాత్రమే ఉంటారని, అలాంటప్పుడు లోపల జరిగిన సంభాషణ, విచారణ ఇదే అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు ఎలా రాశాయన్నారు. లోపల జరిగిన విచారణ విషయాలను ఈ పత్రికలకు ఎవరు చెప్పారని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

జనవరిలో శ్రీవారి హుండీ ఆదాయం రూ.123 కోట్లు

తిరుమల: జనవరిలో తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.100 కోట్లు దాటింది. జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తిరుమల శ్రీవారికి హుండీలో రూ.123 కోట్లను భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. జనవరి 2 తేదీన శ్రీవారికి రూ.7.68 కోట్ల హుండీ ఆదాయం లభించింది. టీటీడీ చరిత్రలోనే ఇది అత్యధిక ఆదాయాల్లో రెండోది. గత ఏడాది నుంచి తిరుమల శ్రీవారి ఆదాయం ప్రతి నెలా రూ.వంద కోట్లు దాటుతుండడం గమనార్హం.

కర్ణాటక సంగీత కళాకారిణి లలిత చంద్రన్ కన్నుమూత

ఆమె బొంబాయి సిస్టర్స్‌లో ఒకరు

తమిళ సినిమా: ప్రఖ్యాత కర్ణాటక సంగీత కళాకారుల ద్వయంలో ఒకరైన లలితా చంద్రన్ (70) మంగళవారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆమె సోదరి సి.సరోజిని. వీరు కేరళలోని తిరుచ్చూర్‌కు చెందినవారు. తల్లిదండ్రులు ముకుందమ్ భాయ్, చిదంబరం అయ్యర్. తండ్రి ఉద్యోగరీత్యా లలితా చంద్రన్, సరోజిని ముంబైలో పుట్టి పెరిగారు. కర్ణాటక క్లాసికల్ సంగీతంలో ప్రావీణ్యం సాధించడంతో వీరికి బొంబాయి సిస్టర్స్ అనే విశేష గుర్తింపు దక్కింది. తర్వాత వారు చెన్నైలోని అడయార్‌లో స్థిరపడ్డారు. దేశవ్యాప్తంగా కర్ణాటక సంగీత కార్యక్రమాలను నిర్వహించి పేరు గడించారు.

ఏపీలో విద్యారంగం అద్భుతం

- ప్రభుత్వ పాఠశాలల తీరుతెన్నులపై ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ ప్రశంసల జల్లు
- గుంటూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సందర్శన
- విద్యారంగ పురోగతికి వైఎస్ జగన్ మార్గదర్శకుడు అంటూ ప్రశంస


విద్యార్థినితో మాట్లాడుతున్న నిక్ వుజిసిక్

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులు ఆంగ్లంలో మాట్లాడుతున్న తీరు.. అందులో స్పష్టత, వారు అడుగుతున్న ప్రశ్నలకు అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ మంత్రముగ్ధులయ్యారు. 'ప్రపంచం మొత్తానికి నేను ప్రేరణగా నిలిచి ఉండవచ్చు.. కానీ, ఈ ప్రాంతం నాకు ఎంతో ప్రేరణనిచ్చింది' అంటూ ఆయన ఫిదా అయ్యారు. గుంటూరు నగరంలోని చౌత్రా సెంటర్‌లో ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను నిక్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థినులకు లక్ష్యసాధన, దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఆ తర్వాత సాయంత్రం బీఆర్ స్టేడియంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతో పాటు నగరంలోని వివిధ మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన వేలాది మంది టెన్త్ విద్యార్థులనుద్దేశించి చేసిన ప్రసంగంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులు, చేపడుతున్న కార్యక్రమాలపై మరోమారు ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. ఎంతో అంకితభావం ఉన్న ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఉండటం అభినందనీయమంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. అలాగే, 'నేను ప్రపంచవ్యాప్తంగా 78 దేశాలలో పర్యటించా. కానీ ఏ దేశంలో లేని అనుభూతి, ప్రత్యేకతను నేను గుంటూరులో పొందాను. అది నా అదృష్టంగా భావిస్తున్నా. ప్రపంచంలో ఎంతోమంది నన్ను హీరో అని పిలిచి ఉండవచ్చు.. కానీ, అంతకంటే ఎక్కువ ఆనందాన్ని ఇక్కడ పొందాను. వెలకట్టలేని విద్యకు, విజ్ఞానానికి అధిక ప్రాధాన్యమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవా దాలు. ఎంతో మంచి పాలకుడు మీకు ఉన్నారు. అంకితభావం ఉన్న ప్రభుత్వం ఇక్కడ ఉంది. గుంటూరు ప్రాంతం విజ్ఞానం, విద్య పరంగా ఎంతో సామర్థ్యం ఉన్న ప్రాంతం. ప్రపంచవ్యాప్తంగా ఎందరినో కలిశాను. కానీ ఆంధ్రప్రదేశ్ సీఎంతో కలవబోవడం ఎంతో ప్రత్యేకానుభూతిగా ఉంది'.. అంటూ నిక్ తన అనుభూతిని పంచుకున్నారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఇవీ..

ఇది సామాన్యమైన విషయం కాదు..

ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇంత గొప్పగా మాట్లాడుతారా? ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినులు తాను మాట్లాడిన ఫారిన్ ఇంగ్లిషు భాషాశైలిని అర్థంచేసుకుని, అంతేస్థాయిలో ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడిన తీరు అద్భుతం. ఏపీలో ప్రభుత్వ పాఠ శాలలు ఇంత గొప్పగా ఉంటాయని నేను ఊహించలేదు. కార్పొరేట్‌ను తలదన్నే రీతిలో ఒక ప్రభు త్వ పాఠశాల సకల హంగులతో ఉండటం ఎంతో ఆశ్చర్యంగా ఉంది. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థినులను ఇంత గొప్ప ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దడం సామాన్య విషయం కాదు.

నా జీవితగాథపై పాఠ్యాంశమా!? జగన్ దేశంలోనే బెస్ట్ సీఎం

రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన 10వ తరగతి ఇంగ్లిషు టెక్ట్‌బుక్‌లోని మొదటి పాఠ్యాంశంగా ఉన్న పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో 'ఆటిట్యూడ్ ఆల్టిట్యూడ్' పేరుతో నా జీవితగాథను ముద్రించడం ఆశ్చర్యకరం. పాఠ్యాంశంగా నాకు చోటు కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మీ పాఠ్య పుస్తకంలో రాసిన నా జీవితం గురించి చదివారా? (మీ గురించి చదివామని విద్యార్థులు చెప్పగా, ఆయన ఆంతులేని ఆనందానికి లోనయ్యారు.) ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడిన పలువురు విద్యార్థినులు.. నాడు–నేడు ద్వారా సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని, ఆయన చలువతో అన్ని రకాల వసతులతో చదువుకుంటున్నామని చెప్పారు. ఇక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో విజన్ కలిగిన నాయకునిగా దేశంలోనే బెస్ట్ సీఎంగా నిలిచారని ఈ సందర్భంగా నిక్ వుజిసిక్ అన్నారు.


జిల్లా వార్తలు

జాతీయ స్థాయి పోటీలకు ఖమ్మం అథ్లెట్


గౌతమ్‌ను అభినందిస్తున్న డీవైఎస్‌ఓ, తదితరులు

ఖమ్మంస్పోర్ట్స్: భారత క్రీడా ప్రాధికార సంస్థ (శాయ్) ఆధ్వర్యాన జరగనున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూత్ అథ్లెటిక్స్ పోటీలకు ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీకి చెందిన అల్లూరి గౌతమ్ ఎంపికయ్యాడు. స్థానిక కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థి గౌతమ్ ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో జరిగే యూత్ అథ్లెటిక్స్‌లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎండీ గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ నున్నా రాధాకృష్ణ, కార్యదర్శి ఎండీ షఫిక్‌అహ్మద్ అభినందించారు.

కొబ్బరి రైతులకు సబ్సిడీలు


మాట్లాడుతున్న శాస్త్రవేత్త మల్లేశ్

సత్తుపల్లిరూరల్: కొబ్బరి సాగుకు ముందుకొచ్చే రైతులకు కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా సబ్సిడీలు అందుతాయని అధికారులు వెల్లడించారు. మండలంలోని గంగారం రైతువేదికలో మంగళవారం ఉద్యానశాఖ, కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యాన రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట కొబ్బరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లేశ్, ఎం.కిరణ్‌కుమార్ కొబ్బరి తోటల నిర్వహణ, చీడపీడలు, యాజమాన్య పద్ధతులను వివరించారు. అలాగే, కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా సబ్సిడీపై మొక్కలు ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ఉద్యానవన అధికారి కె.మీనాక్షి మాట్లాడుతూ కొబ్బరి తోటలు వేసిన రైతులు సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ మందపాటి శ్రీనివాసరెడ్డి, రైతు సమన్వయ సమితి కన్వీనర్ తిరుమల్‌రావు, ఏఈఓ ఆకాజ్యోతితో పాటు వేంపాటి లక్ష్మీనారాయణ, తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి, రామకృష్ణ, నాగబాబు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎస్పీఎల్

- పోటీలను ప్రారంభించిన కేయూ పీడీల సంఘం కార్యదర్శి
- సీనియర్స్ విభాగంలో నేటి నుంచి క్వార్టర్ ఫైనల్స్


క్రికెటర్లను పరిచయం చేసుకుంటున్న ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కాలేజీ పీడీ వెంకన్న (ఇన్‌సెట్) 51 పరుగులు చేసిన మ్యాక్స్ కళాశాల క్రీడాకారుడు హేమంత్



గెలుపొందిన కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కాలేజీ, కవిత డిగ్రీ, పీజీ కళాశాల జట్లు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన సుధాకర్ పైప్స్ అండ్ ఫిట్టింగ్స్ కంపెనీ సౌజన్యంతో ఏర్పాటుచేసిన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. ఈమేరకు మంగళవారం పోటీలను కేయూ పీడీల సంఘం కార్యదర్శి, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల పీడీ బి.వెంకన్న ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సాక్షి' మీడియా ఆధ్వర్యాన క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ గుడిమెట్ల మోహన్‌కృష్ణ, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాధారపు రాజుతో పాటు ఉద్యోగులు నెల్లూరి ఉపేందర్, బోడపట్ల వేణు, జుజ్జూరు ఉపేందర్, రాంబాబు, ఆసిఫ్, కిరణ్, సీనియర్ క్రికెటర్లు జోజిచాకో, ఎం.డీ.ఫారూఖ్, రామకృష్ణ, నాగరాజు, అంపైర్లు సమీర్, సాయిచంద్, మధు, భరత్, ఫరీద్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పోటీలు.. విజేతలు..

- కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల – మమత నర్సింగ్ కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కవిత జట్టు 107 పరుగులు చేసింది. జట్టులో దేవన్ ఎనిమిది ఫోర్లతో 38, అజయ్‌పుష్కర్ నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 32 రన్స్ చేశారు. ఆతర్వాత మమత నర్సింగ్ కళాశాల జట్టు 35 పరుగులకే ఆలౌట్ అయింది. కేఎండీసీ బౌలర్లు అరవింద్, భరత్ కళ్యాణ్ మూడేసి వికెట్లు తీసుకోవడంతో విజయం సొంతమైంది.
- కవిత డిగ్రీ, పీజీ కళాశాల – కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల జట్ల మ్యాచ్‌లో కవిత జట్టు 84 పరుగులు చేసింది. జట్టులో ఉమేష్ 28, గౌతమ్ 11, జాహిద్ 16 రన్స్ చేశారు. అనంతరం కిట్స్ జట్టు 66 పరుగులే చేయడంతో ఓటమి పాలైంది.
- వికాస్ డిగ్రీ కళాశాల – యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్ల నడుమ మ్యాచ్‌లో యూసీపీఈ జట్టు 61 పరుగులు చేసింది. ఈ జట్టులో శ్రీను 20 రన్స్ చేశారు. అనంతరం వికాస్ జట్టు ఏడు వికెట్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేధించింది. ఈ జట్టులో పవన్ 24 పరుగులు చేశాడు.
- బ్రౌన్స్ ఫార్మసీ కళాశాల – మ్యాక్స్ ఫార్మసీ కళాశాల మధ్య మ్యాచ్‌లో తొలుత మ్యాక్స్ జట్టు 82 పరుగులు చేసింది. జట్టులో హేమంత్ ఆరు ఫోర్లతో 51 పరుగులు చేయడం విశేషం. ఆతర్వాత బ్రౌన్ జట్టు చివరి బంతి వరకు హోరాహోరీగా పోరాడి ఘన విజయం సాధించింది. ఈ జట్టులో పవన్ 30 పరుగులు చేశాడు.
- ఎస్‌బీఐటీ–1 – గాయత్రి డిగ్రీ కళాశాల జట్ల నడుమ మ్యాచ్‌లో ఎస్‌బీఐటీ–1 జట్టు పరిమిత ఓవర్లలో 82 పరుగులు చేసింది. జట్టులో కళ్యాణ్ 24, మహిమరాజ్ 18, నవీన్ 19 పరుగులు చేశారు. అనంతరం గాయత్రి జట్టు 67 పరుగులు మాత్రమే చేసింది. దీంతో ఎస్‌బీఐటీ–1 కళాశాల జట్టు రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది.
- బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల – ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్–2 జట్ల నడుమ మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసిన బొమ్మ జట్టు 76 పరుగులు చేసింది. జట్టులో మహేష్ 24, ఉదయ్ 19 రన్స్ చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్–2 నిర్ణీత ఓవర్లలో 59 పరుగులు చేసి ఓటమి పాలైంది. కాగా, సీనియర్స్ విభాగంలో బుధవారం నుంచి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు వెల్లడించారు.

గురుకులాల్లో డిగ్రీ, ఇంటర్ ప్రవేశాలు

భద్రాచలం: వచ్చే విద్యాసంవత్సరం గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు వెల్లడించారు. మణుగూరు, భద్రాచలం (పురుషులు), కొత్తగూడెం(మహిళలు), దమ్మపేట పెద్దవాగు ప్రాజెక్ట్ (మహిళలు), ఖమ్మం (మహిళలు) కళాశాలల్లో ప్రవేశాలకు ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ, తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లోనైతే రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లోనైతే రూ.2 లక్షలలోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఈ నెల 5 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇక ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, దమ్మపేట, కిన్నెరసాని, భద్రాచలంలో ఉన్న ప్రతిభ జూనియర్ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాలకు గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు ఈ నెల 16 లోగా దరఖాస్తు చేసుకోవాలని పీఓ పేర్కొన్నారు. కాగా, ప్రవేశాలకు సంబంధించి ప్రచార పోస్టర్లను ఖమ్మంలో మంగళవారం కలెక్టర్ గౌతమ్, ప్రిన్సిపాళ్లతో కలిసి పీఓ గౌతమ్ పొట్రు ఆవిష్కరించారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్, ఐటీడీఏ పీఓ గౌతమ్ తదితరులు

కొత్తగూడెం ఏరియాలో 101 శాతం బొగ్గు ఉత్పత్తి

- ఈనెల 15వ తేదీ నుంచి జీకేఓసీలో మిగిలిన బొగ్గు తవ్వకాలు
- ఏరియాలో 484 క్వార్టర్ల నిర్మాణానికి నిధుల మంజూరు
- ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేశ్



వివరాలు వెల్లడిస్తున్న జీఎం రమేశ్, పక్కన అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధి కొత్తగూడెం ఏరియాలో జనవరి నెలకు నిర్దేశించిన 13.71 లక్షల టన్నుల ఉత్పత్తికి గాను 13.78 లక్షల టన్నులు (101 శాతం) ఉత్పత్తి నమోదైందని ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేశ్ వెల్లడించారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గత పది మాసాల ఉత్పత్తి లక్ష్యం 113.13 లక్షల టన్నులకు గాను 101.51 లక్షల టన్నులు ఉత్పత్తి (90 శాతం) సాధించినట్లు తెలిపారు. అలాగే, ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు 2,103 రేక్‌లు, జనవరిలో 322 రేక్‌ల బొగ్గు రవాణా జరిగిందని చెప్పారు. ఇక జేవీఆర్‌ఓసీ–2లో 9.40 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 11.91 లక్షల టన్నులు (127 శాతం), కిష్టారం ఓసీలో 1.90 లక్షల టన్నుల లక్ష్యానికి 1.69 లక్షల టన్నులు, పీవీకే–5 షాఫ్ట్ గనిలో 41 వేల టన్నుల లక్ష్యానికి 18 వేల టన్నులు ఉత్పత్తి చేసినట్లు వెల్లడించారు. అయితే, జీకేఓసీలో మిగిలిన 1.50 లక్షల టన్నుల బొగ్గు తవ్వకాన్ని ఈ నెల 15 నుంచి ప్రారంభించి నెలాఖరుకు పూర్తిచేస్తామని వివరించారు. కాగా, కొత్తగూడెం ఏరియాలో 484 క్వార్టర్ల నిర్మాణానికి రూ.265 కోట్లను యాజమాన్యం కేటాయించిందని జీఎం తెలిపారు. అందులో పాలలచ్చమ్మ గ్రౌండ్ వద్ద జామాయిల్ తోటలో 210, సత్తుపల్లిలో 81, రెస్క్యూ స్టేషన్ సమీపాన 60, బంగ్లోస్‌లో 84 అధికారుల క్వార్టర్లు నిర్మించి, మిగిలినవి కార్పొరేట్ ఏరియాలో నిర్మించనున్నట్లు చెప్పారు. సమావేశంలో అధికారులు ఆర్.నారాయణరావు, రఘురామిరెడ్డి, బి.రవీందర్, సూర్యనారాయణ, శామ్యూల్ సుధాకర్, యోహాన్, రమణారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌టీపీ సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఖానాపురం హవేలీలోని కొలిపాక ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు తెలిపారు. సమావేశానికి అసెంబ్లీ నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, జిల్లా అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాలు, మండలాలు, డివిజన్లు పట్టణాల అధ్యక్షులు హాజరుకావాలని సూచించారు.

బ్యాక్టీరియాతో మొక్కజొన్నలో కాండం కుళ్లు తెగులు


తెగులు సోకిన మొక్కజొన్నచేనులో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బోనకల్: మొక్కజొన్నలో బ్యాక్టీరియా కారణంగా కాండం కుళ్లు తెగులు ఆశిస్తోందని వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు హేమంత్‌కుమార్, రవికుమార్ వెల్లడించారు. బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామంలో తెగులు సోకిన మొక్కజొన్న పంటలను వారు మంగళవారం పరిశీలించి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎర్వీనియా క్రైసోందమ్ జియో అనే బ్యాక్టీరియా ద్వారా ఈ తెగులు వ్యాప్తి చెందుతోందని చెప్పారు. పైరు తొలి దశలో ఆశించిన తెగులు కారణంగా కణువుకు దగ్గరగా ఆకు తొడిమ, కాండం రంగును కోల్పోయి మచ్చలు ఏర్పడడంతో పాటు మొక్క పైభాగం, ఆకులు ఎండిపోతాయని పేర్కొన్నారు. తెగులు సోకిన మొక్కజొన్న పైభాగం, కణువుభాగం కుళ్లిపోవడమే కాక, చీల్చి చూస్తే కుళ్లిపోయిన కోడిగుడ్డు వాసన వస్తుందన్నారు. కాగా, నిలిచిన మురుగు నీరు లేదా డ్రెయినేజీ నీటిని పంటకు వాడొద్దని సూచించారు. తెగులు సోకిన సమయంలో తాత్కాలికంగా నత్రజని సంబంధిత యూరియా ఎరువు వాడకం ఆపేసి, 33 శాతం క్లోరిన్ కలిగిన బ్లీచింగ్ పౌడర్‌ను ఎకరాకు నాలుగు కిలోల చొప్పున ద్రావణం రూపంలో మొక్క మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శరత్‌బాబు, రైతులు ఇబ్రహీం, నాగేశ్వరరావు, రంగయ్య, రఫీ, లాలయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.